ఈ రోజు (27.12.2022) జరిగిన సిపిఐ(యం) ప్రెస్‌మీట్ నోట్‌ను ప్రచురణార్థం పంపుతున్నాము.
– జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి.

## గవర్నర్లను ఆయుధాలుగా మార్చుకుని
## రాష్ట్రాలను అన్ని విధాలా దెబ్బతీస్తున్నారు
## కేంద్రం తీరుపై కేరళ ఎక్సైజ్, స్థానిక స్వపరిపాలనశాఖ మంత్రి రాజేష్
## విద్య, వైద్యం, ఉపాధిలో కేరళ ముందుంది
## ఉమ్మడి అంశాలపైనా కేంద్రం పెత్తనం

బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఫెడరల్ వ్యవస్థ మీద, రాష్ట్రాల హక్కుల మీద పెద్దఎత్తున దాడికి దిగుతోందని, గవర్నర్లను ఆయుధాలుగా మార్చుకుని రాష్ట్రాలను అన్ని విధాలా దెబ్బతీస్తోందని కేరళ ఎక్సైజ్, స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి ఎం.బి.రాజేష్ అన్నారు. కేంద్రలోని బిజెపి ప్రభుత్వం దీనికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ విధానాలను కేరళ ప్రభుత్వం అనుసరిస్తోందని తెలిపారు. మంగళవారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి అంశాలపైనా కేంద్రం పెత్తనం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రాలకు చట్ట ప్రకారం ఇవ్వాల్సిన నిధులనూ ఇవ్వకుండా ఆర్థికంగా ఇబ్బందులు సృష్టిస్తోందని పేర్కొన్నారు. కేరళకు చట్ట ప్రకారం రావాల్సిన రూ.30 వేలకోట్లకు కోత పెట్టిందని పేర్కొన్నారు. జిఎస్‌టి పరిహారం పదివేలకోట్లు, రెవెన్యూలోటు రూ.6770 కోట్లు, పన్నుల్లో వాటాను 2.5 శాతం నుండి 1.5 శాతానికి కుదించారని, దీనివల్ల రూ.12,500 కోట్లు నష్టపోయామని తెలిపారు. అలాగే సహకార వ్యవస్థనూ దెబ్బతీసిందని, కేంద్రస్థాయిలో దీనికి హోంశాఖ మంత్రిని ఇన్‌ఛార్జి పెట్టిందంటేనే దీనివెనుక ఉద్దేశం ఏమిటో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఇలా రాష్ట్రాలన్నీ పూర్తిగా కేంద్రంపై ఆధారపడేలా చేస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానాలపై దృష్టి సారించిందని చెప్పారు. ఆర్థికాభివృద్ధికి అవసరమైన పద్దతులతోపాటు, సాంఘిక సంక్షేమ పథకాలనూ పెద్దఎత్తున అమలు చేస్తోందని వివరించారు. ఇప్పటికే జిఎస్‌డిపిలో దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ముందుందని పేర్కొన్నారు. వచ్చే నాలుగేళ్లలో రెండు మిలియన్ల నాలెడ్జ్ బేస్డ్ ఉద్యోగాలను కల్పించడంపై దృష్టి సారించామని చెప్పారు. సాంఘిక సంక్షేమ రంగానికి దేశంలోనే అత్యధిక నిధులు కేటాయించామని చెప్పారు. కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌కు ఇప్పటి వరకూ రూ.70 వేల కోట్లు ఖర్చు చేశామని, దీనిలో మూడువేల కోట్లు ప్రభుత్వ విద్యకు ఖర్చు చేస్తున్నామని వివరించారు. నీతి అయోగ్ ఇచ్చిన స్కూల్ క్వాలిటీ ఇండెక్స్‌లో కేరళ మొదటిస్థానంలో ఉందని తెలిపారు. ఎల్‌డిఎఫ్ తొలి ఐదేళ్లలో ప్రాథమిక విద్యపై దృష్టి పెడితే, రానున్న ఐదేళ్లలో ఉన్నత విద్యపై దృష్టి సారించిందని, యూనివర్శిటీల్లో సదుపాయాలు, అకడమిక్ విధానాలను బలోపేతం ద్వారా మెరుగైన విద్యపై దృష్టి సారించామని పేర్కొన్నారు. అలాగే ప్రజారోగ్యం, విద్యకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నామని, సూపర్‌స్పెషాలిటీ సేవలనూ కల్పిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా అప్పులు తెచ్చుకునేందుకూ అనుమతులు ఇవ్వడం లేదని వివరించారు. ముఖ్యంగా కేరళలో పరిశ్రమలు పెరిగాయని తెలిపారు. కేంద్రం తన పిఎస్‌యులను ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయిస్తే కేరళ వేలంలో పాల్గొని దాన్ని సహకార పద్ధతిలో నడుపుతోందన్నారు. గతంలో ఇదే పిఎస్‌యులకు కేరళ ప్రభుత్వం స్థలాన్ని ఉచితంగా ఇచ్చిందని, అదే స్థలాన్ని వ్యాపారంగా మార్చి కేంద్రం అమ్మకానికి పెట్టిందని వివరించారు. వాటన్నిటినీ కేరళ ప్రభుత్వమే తీసుకుని నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

## మోడీ వద్ద స్పష్టమైన హామీ తీసుకోవాలి

ప్రధాని మోడీని కలిసేందుకు వెళుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విభజన, హామీలు, పోలవరం, విశాఖపట్నం స్టీలు ప్లాంటు మీద స్పష్టమైన హామీ తీసుకురావాలని, లేనిపక్షంలో రాష్ట్రానికి కేంద్రానికి తాకట్టు పెట్టినట్లు భావించాల్సి వస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం మోడీని నిలదీయాలని అన్నారు. పోలవరం కేంద్రం బాధ్యతని, అయినా పట్టనట్లు వ్యవహరిస్తోందని వివరించారు. గిరిజనుల విషయంలో అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, వారికి ఇవ్వాల్సిన నష్టపరిహారం ఇవ్వడం లేదని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులను వేధిస్తోందని, వారాలు, నెలల తరబడి జీతాలు ఇవ్వడం లేదని అన్నారు. ఈ సమస్యలన్నిటిపై రాష్ట్రం దృష్టి సారించి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

= = = =